క్లుప్తంగా

వేదగిరిని దర్శించుకున్న జడ్జి



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారిని జిల్లా మూడో అదనపు జడ్జి తేజోవతి తన కుటుంబసభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ స్వాగతం పలికారు.

25న ఆడియో రిలీజ్



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

నెల్లూరు(మినీబైపాస్): నెల్లూరులో ఏడాది పాటు షూటింగ్ జరుపుకొన్న నెల్లూరి నెరజాణ చిత్ర ఆడియో రిలీజ్ కార్యక్రమాన్ని నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 25న నిర్వహించనున్నామని డైరెక్టర్ చిగురుపాటి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దాదాపు వెయ్యి మంది కళాకారులను సత్కరించనున్నామని చెప్పారు.

స్వర్ణాల చెరువులో మేయర్ పరిశీలన

నెల్లూరు సిటీ: దర్గామిట్టలోని స్వర్ణాల చెరువును మేయర్ స్రవంతి శనివారం పరిశీలించారు. చెరువు ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

'గురువుకు వందనం' రేపు

• హాజరుకానున్న మాజీ ఉప రాష్ట్రపతి

నెల్లూరు(బృందావనం): వీఆర్ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకుడు మోపూరు పెంచలయ్య స్మృత్యర్థం నగరంలోని రవీంద్రనాథ్ టాగూర్ ఆడిటోరియంలో గురువుకు వందనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని మోపూరు వేణుగోపాలయ్య స్మారక సాహితీ సంచిక కమిటీ ముఖ్య సమన్వయకర్త రమణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరై తన గురువు మోపూరు వేణుగోపాలయ్యకు నివాళులర్పించి, ప్రవచన సుధాకరుడి వేణునాథం స్మారక సాహితీ సంచికను ఆవిష్కరించనున్నారని పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వాహనచోదకుడి మృతి



నెల్లూరు(క్రైమ్): ట్రాక్టర్ ఢీకొనడంతో స్కూటరిస్ట్ మృతి చెందిన ఘటన నిప్పో సెంటర్ వద్ద శనివారం చోటుచేసుకుంది. సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. అయ్యప్పగుడి సమీపంలోని విక్రమనగర్‌లో నివాసం ఉంటున్న వెంకయ్య (80) తన ఇంటి నుంచి నగరంలోకి బైక్‌పై బయల్దేరారు. నిప్పో సెంటర్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి ట్రాక్టర్ వేగంగా ఢీకొంది. కిందపడిపోయిన ఆయన్ను కొద్దిదూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. తీవ్రంగా గాయపడిన వెంకయ్య అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి కుమారుడు కల్యాణ్ చక్రవర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పెన్నా బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం

• డిగ్రీ విద్యార్థికి తీవ్రగాయాలు

నెల్లూరు(క్రైమ్): మినీ లారీ ఢీకొనడంతో ఇంటి నుంచి కళాశాలకు ద్విచక్రవాహనంలో వెళ్తున్న విద్యార్థి తీవ్రంగా గాయపడిన ఘటన పాత పెన్నా వంతెనపై శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. కోవూరు మండబయలుకు చెందిన సుజిత్‌రెడ్డి నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. కళాశాల ఫీజు చెల్లించేందుకు గానూ ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో బయల్దేరారు. పెన్నా వంతెనపై వెళ్తుండగా, వెనుక నుంచి మినిలారీ వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ద్విచక్రవాహనం నుంచి వెనుక పడటంతో సుజిత్‌రెడ్డి తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం 108లో మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

నెల్లూరు రూరల్: సజ్జాపురంలో యువతి అదృశ్యమైన ఘటనపై రూరల్ పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. ఇంటి నుంచి బయటకెళ్లిన తన కుమార్తె అదృశ్యమైందని, గాలించినా ప్రయోజనం లేకపోవడంతో యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతుకు వెన్నుదన్నుగా..

• వ్యవసాయ రంగానికి రైతు భరోసా కేంద్రాలతో ఆసరా
• చెంతకే నాణ్యమైన ఎరువులు, విత్తనాలు
• పంటల దిగుబడుల్లో సూచనలు, సలహాలు
• ఈ – క్రాప్ ద్వారా ఇన్‌పుట్ సబ్సిడీ

నెల్లూరు రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు అన్నదాతకు అండగా నిలుస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని వసతులను వారి చెంతకే చేరుస్తున్నారు. ఈ నాలుగేళ్లలో ఆర్బీకేలు రైతులకు నేస్తాలుగా మారాయి.

గతంలో అన్నీ అగచాట్లే..

గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యమిచ్చేవారు కాదు. ఆయా సీజన్లలో మండల కేంద్రాల్లోని వ్యవసాయ కార్యాలయం లేదా గోదాముల నుంచో ఎరువులు, విత్తనాలను రైతులకు నామమాత్రంగా అందజేసేవారు. సబ్సిడీపై అందించే విత్తనాలు, ఎరువులు నాసిరకంగా ఉండటంతో ప్రైవేట్ దుకాణాల వైపు రైతులు మొగ్గుచూపేవారు. ఆర్థిక భారంతో పాటు అధిక సమయాన్ని రైతులు వెచ్చించాల్సి వచ్చేది.



సౌత్‌మోపూరు ఆర్బీకేలో రైతులతో వ్యవసాయాధికారుల సమావేశం (ఫైల్)

ఆర్బీకేల్లో సేవలిలా..

→ ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాలకు తరలించి రైతులకు అవసరమైన మేరకు అందిస్తున్నారు. దీంతో మండల కేంద్రానికి వెళ్లే అవస్థలు తప్పాయి.

→ పంట కోత ప్రయోగాల ద్వారా దిగుబడులను అంచనా వేస్తున్నారు.

→ వైఎస్సార్ పొలంబడి పేరిట వ్యవసాయ శాఖ అధికారులు పొలాల వద్దకెళ్లి పైర్ల సాగులో చీడపీడల నివారణకు తగిన సలహాలను అందిస్తున్నారు.

→ కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ)ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఐదుగురు సభ్యులతో గ్రూపు ఏర్పాటై వారికి వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా రూ.15 లక్షల విలువజేసే యంత్ర పరికరాలను 40 శాతం సబ్సిడీకి అందిస్తున్నారు. ఇందులో రైతు వాటా 10 శాతం కాగా, 50 శాతం రుణ సదుపాయాన్ని బ్యాంకుల ద్వారా కల్పిస్తున్నారు.

→ పంటలకు సంబంధించి ఈ – క్రాప్‌ను నమోదు చేస్తారు. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తుల సమయాల్లో రైతులకు ప్రభుత్వం దన్నుగా నిలుస్తోంది. ఇన్‌పుట్ సబ్సిడీని అందించి ఆదుకుంటోంది.



పొలాల్లో పైర్లను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

→ సున్నా వడ్డీ పంట రుణాలనూ పొందవచ్చు. పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు సహకరిస్తోంది.

ఆర్బీకే వ్యవస్థ దేశానికే ఆదర్శం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆర్బీకే వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. గతంలో రైతులు మండల కేంద్రానికి వెళ్లి ఎరువులు, విత్తనాలను తెచ్చుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం రైతుల చెంతకే చేరుతున్నాయి. ఆర్బీకే ద్వారా రైతులకు సేవలను విస్తృతంగా అందిస్తున్నాం.

– రామలక్ష్మి, వీఏఏ, సౌత్‌మోపూరు ఆర్బీకే

నకిలీ విత్తనాల బెడద తొలగింది



గతంలో దూర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను రైతులు కొనుగోలు చేయాల్సి వచ్చేది. నకిలీ విత్తనాలు, ఎరువుల బెడదా అధికంగా ఉండేది. ప్రస్తుతం నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతుల చెంతకే ప్రభుత్వం చేరుస్తోంది. దీంతో రైతులు ఆనందంగా ఉన్నారు.

– నాగమోహన్, రూరల్ మండల వ్యవసాయాధికారి



→ ఈ చిత్రంలోని రైతు డేగా వెంకయ్య నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరులో నివాసం ఉంటున్నారు. ఈయనకు నాలుగెకరాల పొలం ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి ప్రోత్సాహం అందలేదు. ఎరువులు, విత్తనాలను నెల్లూరెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా తొలగిపోయింది. ఆర్బీకేలోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులను పొందుతున్నారు. రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ.13500ను పొందగలుగుతున్నారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు గ్రామంలోనే అందుతుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



→ ఈ ఫొటోలోని రైతు రామబత్తిన శంకరయ్య నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరులో ఉంటున్నారు. ఈయనకు 11 ఎకరాల పొలం ఉంది. స్థానికంగా ఉన్న ఆర్బీకేలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులను పొందుతున్నారు. ఎరువులు, విత్తనాల కోసం గతంలో నెల్లూరెళ్లి అవస్థలు పడుతూ ప్రైవేట్ దుకాణం నుంచి తెచ్చుకునేవారమని, ప్రస్తుతం ఎంతో సౌకర్యంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు రైతుల పాలిట వరం

రైతుల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు వారికి ఎంతో భరోసాను కల్పిస్తున్నాయి. నెల్లూరు రూరల్ మండలంలోని పెద్ద గ్రామాల్లో సౌత్‌మోపూరు ఒకటి. ఈ పంచాయతీ పరిధిలో మొగళ్లపాళెం, పలు ప్రాంతాలు ఉన్నాయి. వ్యవసాయ శాఖ అధికారుల నివేదికల మేరకు 2300 ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారు. అనధికారికంగా అసైన్డ్ పొలాల్లో మరో 200 ఎకరాల్లో వరిసాగవుతోంది. 30 ఎకరాల్లో పత్తి, పదెకరాల్లో వేరుశనగను సాగు చేస్తున్నారు. ఇక్కడి ఆర్బీకేలో పలు సేవలందుతున్నాయి.

రేషన్ బియ్యం పంపిణీ వాహన అద్దం ధ్వంసం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రేషన్ లబ్ధిదారులకు ప్రతి నెలా ఇంటింటికీ వెళ్లి బియ్యం పంపిణీ చేసే వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురం ప్రాంతంలో రేషన్ బియ్యాన్ని సరఫరా చేసే వాహన ముందు అద్దాన్ని గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి పగులగొట్టారు. శ్రీవాణి స్కూల్ సమీపంలో రేషన్ సరఫరా వాహనాన్ని శుక్రవారం సాయంత్రం పార్క్ చేసిన జకీర్ తిరిగి శనివారం ఉదయం ఆ వాహనాన్ని తీసేందుకు వెళ్లగా అద్దం పగిలి ఉండటాన్ని గుర్తించారు. అయితే కొన్ని రోజులుగా ఈ వాహనంపై టీడీపీకి చెందిన స్టిక్కర్లను కొందరు అంటిస్తుండటం, జకీర్ వాటిని తొలగిస్తున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడంపలు అనుమానాలకు తావిస్తోంది. ఈ మేరకు నవాబుపేట పోలీసులకు జకీర్ శనివారం ఫిర్యాదు చేశారు.

సిటీ బస్సుల ఏర్పాటుకు వినతి

నెల్లూరు సిటీ: నగరంలో సిటీ బస్సులను ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని ప్రయాణికుడు కోరారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఆర్టీసీ నెల్లూరు ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ తన కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ క్రమంలో సిటీ బస్సుల ఏర్పాటు అంశాన్ని బాలాజీనగర్‌కు చెందిన రాజా తెలియజేశారు. కాగా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తప్పక తీసుకెళ్తామని మేనేజర్ హామీ ఇచ్చారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల పాటు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు శనివారంతో ముగిశాయి. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సివిల్ సప్లయ్స్ డిప్యూటీ కలెక్టర్ సుధాకర్ హాజరయ్యారు. అనంతరం వివిధ క్రీడల్లో శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు. సీఈఓ పుల్లయ్య, చీఫ్ కోచ్ యతిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్

ఏఐవైఎఫ్ సర్వసభ్య సమావేశం

నెల్లూరు(వేదాయపాళెం): నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు నిరుద్యోగ భృతిని ఇవ్వాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు పేర్కొన్నారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఏఐవైఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. యువతకు రాజకీయ శిక్షణ తరగతులను గుంటూరులో ఈ నెల 27 నుంచి 30 వరకు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని చెప్పారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుబ్బారావు, జిల్లా కన్వీనర్ మున్నా, నగర కార్యదర్శి గౌస్‌బాషా, మధు, బాదుల్లా, అల్తాఫ్, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.



చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

నెల్లూరు(వేదాయపాళెం): చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య పేర్కొన్నారు. అయ్యప్పగుడి సమీపంలోని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం నెల్లూరు రూరల్ నియోజకవర్గ యూత్ కమిటీని ఏర్పాటు చేశారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రూరల్ కార్యవర్గ సభ్యులుగా సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, శివకుమార్, సందానీబాషా, నారాయణ, వెంకటేష్, బాలచంద్ర, యూత్ కమిటీ సభ్యులుగా అనిల్, హరిబాబు, మహేష్, విజయ్‌కృష్ణ, రవిచంద్ర, జగన్, మండల కమిటీ అధ్యక్షుడిగా కడప సునీల్, ఉపాధ్యక్షుడిగా తిరుమలేష్‌ను నియమించారు. బీసీ యువత జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి మురళీయాదవ్, బీసీ నేతలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సురేష్‌బాబు, విజయ్‌కృష్ణ, వేణు, తదితరులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులను అభినందిస్తున్న శంకరయ్య

ఇంగ్లిష్‌లో బోధనపై ముగిసిన శిక్షణ

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ బోధనపై అధ్యాపకులకు నిర్వహిస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. శిక్షణకు తొమ్మిది కళాశాలలకు చెందిన 50 మంది అధ్యాపకులు హాజరయ్యారు. ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు తగిన నైపుణ్యాలను అధ్యాపకులు అలవర్చుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ గిరి కోరారు. వైస్ ప్రిన్సిపల్ రమణరావు, తదితరులు పాల్గొన్నారు.



మహావిష్ణు బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను వేడుకగా శనివారం ప్రారంభించారు. పుణ్యాహవచనం, అష్టోత్తర శతకలశాభిషేకం, తదితర పూజా కార్యక్రమాలను భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థాన స్థానాచార్యుడు కొమాండూరు ఇళైయవిల్లి స్థలశాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయకర్తలుగా ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఉష, నరసింహారెడ్డి, విజయ, శ్రీనివాస్, రాధ, శింగంపల్లి నిఖిలేష్‌కుమార్, దివ్యభవాని దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, వెంకటరత్నం, పాలకమండలి సభ్యులు మోహన్‌రావు, రమణయ్య, మురళీమోహన్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33 / 11 కేవీ డీఎస్సార్ సబ్‌స్టేషన్‌ను ఇండోర్ సబ్‌స్టేషన్‌గా ఆధునికీకరించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని ఐతు సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేతాజీనగర్, ప్రగతినగర్, గౌతమినగర్, లేక్ వ్యూకాలనీ, పోస్టల్ కాలనీ, జెడ్పీ కాలనీ, డీఎస్సార్ హాస్పిటల్, పొదలకూరు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

25న సంగీత, నృత్య పోటీలు

నెల్లూరు(బృందావనం): జిల్లాలో వర్ధమాన కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నగరంలోని పురమందిరంలో సంగీత, నృత్య పోటీలను ఈ నెల 25న నిర్వహించనున్నామని కేతా సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు తమ ఎంట్రీలను ఈ నెల 22లోపు పంపాలని, వివరాలకు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మల్లికార్జున, రామ్మోహన్‌రావు, వేణుమాధవ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఉచిత మందుల పంపిణీ

నెల్లూరు(సెంట్రల్): నట్టల నివారణ మందులను జిల్లాలో ఈ నెల 16 నుంచి ఉచితంగా పంపిణీ చేయనున్నామన్లి పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి మహేశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పశుసంవర్ధక శాఖ కార్యాలయాల నుంచి గ్రామంలోని ఆర్బీకేలకు పంపిణీ చేసి, అక్కడి నుంచి ఉచితంగా మందులను ఇస్తామన్నారు. జిల్లాలో సుమారు 14 లక్షల గొర్రెలు, రెండు లక్షల మేకలు ఉన్నాయని, వీటికి మందులను పంపిణీ చేయనున్నామని వివరించారు.

దోసకాయలదిబ్బలో చోరీ

నెల్లూరు రూరల్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మూడో మైలు సమీపంలోని దోసకాయలదిబ్బలో చోటు చేసుకుంది. వివరాలు.. వైద్య పరికరాల వ్యాపారం చేసే సాయిమోహన్ వ్యాపార నిమిత్తం ఒంగోలుకు ఈ నెల ఆరున వెళ్లారు. శుక్రవారం ఇంటికొచ్చిన ఆయన తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా, బీరువాలోని రూ.90 వేల విలువైన వస్తువులు అపహరణకు గురయ్యాయని నిర్ధారించుకున్నారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. సీఐ శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు.

లో ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో రూ.కోటితో 14 నూతన ట్రాన్స్‌ఫార్మర్లను వారంలో ఏర్పాటు చేశామని ఎస్పీడీసీఎల్ నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. నగరంలో లో ఓల్టేజీ సమస్య ఉన్న కోటమిట్ట, వెంకటేశ్వరపురం, జనార్దన్‌రెడ్డి కాలనీ, కిసాన్‌నగర్, మాగుంట లేఅవుట్, స్టోన్‌హౌస్‌పేట, గోమతినగర్, భగత్‌సింగ్ కాలనీ, బీవీనగర్, ఏకేనగర్ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని చెప్పారు. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్యను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది గుర్తించారని, ఆయా ప్రాంతాల్లోనూ త్వరలో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోమశేఖర్‌రెడ్డి

పాదయాత్ర కోసం సోమిరెడ్డి దిగజారుడు

నెల్లూరు(దర్గామిట్ట): టీడీపీ అధినేత చంద్రబాబు కుమారుడు లోకేష్ పాదయాత్రకు జన సమీకరణకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లోక్లాస్ బెగ్గింగ్‌కు తెరదీశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య యాదవ్ విమర్శించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కంపెనీల యాజమాన్యాల వద్ద కోట్లను దండుకునే సోమిరెడ్డి లక్షలు అడుక్కునే స్థాయికి దిగజారారన్నారు. రైతులు తమ పొలాల్లో మట్టి తోలుకున్నా.. జిల్లాలో ఎవరైనా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినా వెంటనే సోమిరెడ్డి అక్కడ వాలిపోయి డబ్బులు డిమాండ్ చేయడం ఆనవాయతీగా మారిందని ధ్వజమెత్తారు. కొంతమంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కోట్లకు పడగలెత్తిన సోమిరెడ్డి పాదయాత్ర పేరిట డబ్బులు వసూలు చేస్తుండటంతో జిల్లాలోని వ్యాపారులు, పరిశ్రమల యజమానులు బెంబేలెత్తుతున్నారని తెలిపారు. నెడ్క్యాప్ డైరెక్టర్ దాసరి భాస్కర్, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శివప్రసాద్, పార్టీ టీపీగూడూరు మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటశేషయ్య